క్లుప్తంగా

వేసవి శిక్షణకు విశేష స్పందన



బోధన్: మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో 6 నుంచి 10వ తరగతి విద్యార్థుల కోసం ప్రారంభించిన వేసవి శిక్షణ శిబిరాలకు విద్యార్థుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. బోధన్ పట్టణ కేంద్రంలోని రాకాసీపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల, సాలూర జెడ్పీహెచ్ఎస్‌లో వేసవి శిక్షణ శిబిరాలు ఆయా మండలాల ఎంఈవోలు నాగయ్య, రాజీ మంజూష ప్రారంభించారు. ఆదివారం సాలూర జడ్పీహెచ్ఎస్ శిబిరానికి సుమారు 50 మంది విద్యార్థులు హాజరయ్యారు. స్పోకెన్ ఇంగ్లిష్, చిత్ర లేఖనం, యోగా తరగతులు నిర్వహించారు. ఉపాధ్యాయులు శిబిరాలను పర్యవేక్షిస్తున్నారు.

ఆలయంలో పిచ్చిమొక్కల తొలగింపు



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మహాత్మా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో 'స్వచ్ఛ ఆర్మూర్' కార్యక్రమాన్ని ఆదివారం పెర్కిట్‌లోని విశాఖ కాలనీలో ఉన్న శ్రీ రమా సత్యనారాయణ స్వామి ఆలయంలో నిర్వహించారు. ఆలయ ఆవరణలో పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించారు. వాటర్ ట్యాంక్ సమీపంలో ఉన్న చెత్తను శుభ్రపరిచారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కాలనీవాసులకు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సుంకె శ్రీనివాస్ సూచించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్వచ్ఛంద సంస్థ సభ్యులు లిక్కి గంగాధర్, హరిప్రసాద్, ప్రశాంత్, సుంకె నిశాంత్, రాజ్ కుమార్, సాయికిరణ్, భోజన్న, మధుసూదన్, బొగడమీది గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రుద్రూర్‌లో ఉచిత వైద్య శిబిరం



రుద్రూర్: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆదివారం ప్రైవేటు ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. బీపీ, షుగర్ తదితర పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. డాక్టర్ తరుణ్ కుమార్‌రెడ్డి, ల్యాబ్ టెక్నీషియన్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాల ఫలితాలు

రుద్రూర్: ప్రైవేటు స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు మంచి ప్రతిభ చూపుతున్నారని మార్కెట్ కమిటీ చెర్మన్ గాయక్వాడ్ హన్మంతు అన్నారు. పదో తరగతి ఫలితాల్లో పొతంగల్ మండల కేంద్రానికి చెందిన రీతిక 546 మార్కులు సాధించి మండల టాపర్‌గా రావడంతో ఆదివారం ఎమ్మార్పీస్ నాయకులు ఘనంగా సన్మానించారు. విద్యార్థినితో పాటు ఆమె తల్లి తండ్రులను సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో నాగయ్య, యాదవ్‌రావు, సంజీవ్, జయరాం, లక్ష్మణ్, హన్మంతు, సంతోష్, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు

బాధిత కుటుంబాలకు పరామర్శ



రుద్రూర్: మండలంలోని పలు గ్రామాల్లో బాధిత కుటుంబ సభ్యులను ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్‌రెడ్డి పరామర్శించారు. ఆయన వెంట నాయకులు ఇందూర్ చంద్రశేఖర్, ఎలమంచిలి శ్రీనివాసరావు, పాత బాలకృష్ణ, మాసాని శ్రీనివాస్, సలీం, అంజద్, గంగప్ప, సయ్యద్ ముల్తానీ, షేక్ సిరాజ్, శామీర్ ఖురేషి తదితరులు ఉన్నారు.

బ్రిడ్జి పనులు అడ్డుకున్న గ్రామస్తులు

మోపాల్: మండలంలోని ముదక్‌పల్లి నుంచి బాడ్సి వెళ్లే దారిలో దర్గా వద్ద బ్రిడ్జి పనులను కాంట్రాక్టర్ నాసిరకంగా చేపడుతున్నారని గ్రామస్తులు ఆదివారం పనులను అడ్డుకున్నారు. బ్రిడ్జి నిర్మాణం తర్వాత ఇరువైపులా రోడ్డు చదును చేసేందుకు మొరం పనులు ప్రారంభించారు. అయితే నాణ్యమైన మొరం కాకుండా చెత్తాచెదారంతో కూడిన మట్టితో పనులు చేస్తుండటంతో గమనించిన గ్రామస్తులు పనులను అడ్డుకున్నారు.

బోర్డులకే పరిమితమైన క్రీడా ప్రాంగణాలు

- కానరాని వసతులు.. నిర్వహణ అస్తవ్యస్తం
- ఇబ్బందిపడుతున్న క్రీడాకారులు
- పట్టించుకోని అధికారులు



రాంనగర్ క్రీడా ప్రాంగణంలో పెరిగిన పిచ్చిమొక్కలు



15వ వార్డులో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణం

ఆర్మూర్‌టౌన్: క్రీడా ప్రాంగణాలు బోర్డులకే పరిమితమయ్యాయి. గత ప్రభుత్వం గ్రామీణ క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసింది. ప్రస్తుతం అవి చాలా చోట్ల బోర్డులకే పరిమితమయ్యాయి. పల్లె ప్రగతిలో భాగంగా ఈ క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేశారు. కొన్ని గ్రామాల్లో స్థలం కొరతతో ఊరు బయట ప్రాంతాల్లో, ప్రభుత్వ పాఠశాలల ఆవరణల్లో బోర్డులు పెట్టి ఇదే క్రీడా ప్రాంగణం అంటూ అధికారులు చేతులు దులుపుకొన్నారు. ప్రాంగణాల్లో వాలీబాల్, ఖో–ఖో, లాంగ్ జంప్, కబడ్డీ ఆటలకు సంబంధించిన కోర్టులను ఏర్పాటు చేశారు. అయితే అవి ఇప్పుడు కానరాకుండా పోయాయి.

ఆర్మూర్ పట్టణంలోని 15వార్డు, రాంనగర్, జెడ్పీ బాలుర పాఠశాల, జర్నలిస్టు కాలనీతో పాటు ఇతర ప్రాంతాలతో పాటు గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలను గత ప్రభుత్వంలో అధికారులు ఏర్పాటు చేశారు. కానీ అవి అనుకూలంగా లేకపోవడంతో క్రీడాకారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

గ్రామీణ క్రీడా ప్రాంగణాల్లో ఇప్పటి వరకు ఇప్పటి వరకు క్రీడా సామగ్రి కూడా ఏర్పాటు చేయలేదు. కొన్ని గ్రామాల్లో తూతూ మంత్రంగా క్రికెట్, వాలీబాల్ కిట్లు, టెన్నికాయిట్ రింగ్స్ సరఫరా చేశారు. ప్రాంగణంలో క్రీడా కోర్టులు ఏర్పాటు చేయకపోవడంతోపాటు క్రీడలు ఆడేవారు లేకపోవడంతో పలు గ్రామాల్లో పిచ్చి మొక్కలతో నిండిపోయాయి. ప్రభుత్వం ఇకనైనా స్పందించి గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలను అందుబాటులోకి తేవాలని క్రీడాకారులు, గ్రామస్తులు కోరుతున్నారు.



వెంచర్‌లో క్రికెట్ ఆడుతున్న యువకులు

వినియోగంలోకి తీసుకురావాలి

ప్రభుత్వం క్రీడా ప్రాంగణాలను వినియోగంలో తీసుకొస్తే పట్టణ, గ్రామీణ స్థాయిలో నైపుణ్యం గల క్రీడాకారులు వెలుగులోకి వస్తారు. గత ప్రభుత్వం పేరుకే క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసింది. ఇకనైనా ప్రభుత్వం స్పందించి తగు చర్యలు చేపట్టాలి.

– కట్ట శివతేజ, ఆర్మూర్

వెంచర్లలో ఆడుకుంటున్నాం

క్రీడా ప్రాంగణాలు సరిగా లేక గల్లీలో, వెంచర్లలో ఆడుకోవాల్సి వస్తోంది. చుట్టు పక్కల వారు వచ్చి వెళ్లిపోమంటే అక్కడి నుంచి వెళ్లాల్సి వస్తోంది. ప్రభుత్వం క్రీడాకారులను ప్రోత్సహించాలి. గ్రామీణ క్రీడా ప్రాంగణాలను అందుబాటులోకి తేవాలి. – హరిచరణ్, ఆర్మూర్

ఈఏపీ సెట్‌లో మెరిసిన విద్యార్థులు



కె వివేక్ రెడ్డి



హరివర్ధిని



శ్రీనిక్

పెర్కిట్: హైదరబాద్ ఇంపోల్స్ కళాశాలలో చదువుతున్న ఆలూర్ మండల కేంద్రానికి చెందిన రేగుళ్ల రక్షిత్ ఇంజినీరింగ్ విభాగంలో 2,733 ర్యాంకు సాధించాడు. దీంతో పాటు ఆలూర్ మండల కేంద్రంలోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలకు చెందిన జునేద్ ఖాన్ అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ విభాగంలో 9,102, షేక్ జీశాన్ 19,291 ర్యాంకు సాధించాడు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రిన్సిపాల్ యోగేష్ అభినందించారు.

రుద్రూర్ విద్యార్థికి 1,205 ర్యాంకు

రుద్రూర్: రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన తెలంగాణ ఎప్‌సెట్ ఎంట్రెన్స్ టెస్ట్‌లో రుద్రూర్ మండల కేంద్రానికి చెందిన చిదుర శ్రీనిక్ ఇంజినీరింగ్ విభాగంలో రాష్ట్ర స్థాయి 1208 ర్యాంకు సాధించాడు. గత నెల విడుదలైన జేఈఈ మెయిన్స్‌లో ఆలిండియా 3754 ర్యాంకు సాధించాడు. మండల కేంద్రానికి చెందిన వ్యాపారి చిదుర హరిరాం కవిత దంపతుల కుమారుడు శ్రీనిక్. మంచి ర్యాంకు సాధించిన శ్రీనిక్‌ను స్థానికులు, రుద్రూర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ ఎడ్యుకేషన్ సొసైటీ సభ్యులు అభినందించారు.

రెంజల్ విద్యార్థికి 2,834..



ఆసాని రిషికేశ్

రెంజల్: ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసి ప్రవేశాల కోసం తెలంగాణ ఉన్నత విద్యామండలి నిర్వహించిన ఏఈపీసెట్ ఫలితాల్లో రెంజల్‌కు చెందిన ఆసాని రిషికేశ్ సత్తాచాటారు. ఆదివారం విడుదల చేసిన ఫలితాల్లో రిషికేశ్ 2834 ర్యాంకు సాధించారు. రిషికేశ్‌ను పలువురు అభినందించారు.

శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి



శిబిరంలో మాట్లాడుతున్న ఎంఈవో రాజ గంగారాం

పెర్కిట్: విద్యార్థులు ప్రతిభను మెరుగు పర్చుకోడానికి ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో రాజా గంగారాం సూచించారు. విద్యాశాఖ ఆదేశాల మేరకు ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ తెలుగు మీడియం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం వేసవి శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ.. శిక్షకులు విద్యార్థుల్లో దాగిఉన్న ప్రతిభను వెలికి తీయాలన్నారు. కార్యక్రమంలో క్యాంప్ కో–ఆర్డినేటర్ ఎం శ్రీనివాస్, హెచ్‌ఎం రవీందర్, పీఆర్టీయూ ప్రతినిధులు ఇట్టం గోపాల్, అశోక్, ఉపాధ్యాయులు పోచన్న, రాజ్ కుమార్, అనంత్ రావు, సుజాత, రాధాబాయి, లక్ష్మణ్, రవీందర్, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రయాణికులకు ఆటంకంగా మారిన చెట్లకొమ్మలు

వేల్పూర్: మండలంలోని జాన్కంపేట్ మీదుగా ఆర్మూర్, భీమ్‌గల్ వైపు ఉన్న ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారిపై ఇటీవల అకాల వర్షానికి విరిగిపడ్డ చెట్లు ప్రయాణానికి ఆటంకంగా మారాయని ప్రయాణికులు వాపోతున్నారు. ఇటీవల అకాల వర్షం కురిసినపుడు వీచిన బలమైన గాలులకు జాన్కంపేట్, గోవింద్‌పేట్ గ్రామాల మధ్య చాలా చెట్లు విరిగి ప్రధాన రహదారిపై పడ్డాయి. కరెంటు వైర్లు తెగిపోయాయి. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. జాన్కంపేట్ వీడీసీ వారు జేసీబీ సహాయంతో రోడ్డుపై అడ్డంగా కూలిన చెట్లను తొలగించి, రాకపోకలను పునరుద్ధరించారు. తొలగించిన చెట్లు రోడ్డు పక్కన అలాగే ఉండడంతో ప్రయాణికులకు, వాహనాలకు తగులుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రహదారిపై ఆర్మూర్, భీమ్‌గల్ వైపు నిత్యం వందలాది వాహనాలు తిరుగుతాయి. ఇకనైనా ఆర్‌అండ్‌బీ అధికారులు చర్యలు తీసుకొని విరిగిపడ్డ చెట్లను తొలగించాలని ప్రయాణికులు కోరుతున్నారు.



జాన్కంపేట్ సమీపంలో రోడ్డు పక్కన చెట్లకొమ్మలు

ప్రమాణ స్వీకారోత్సవాన్ని విజయవంతం చేయాలి



బోధన్‌టౌన్: పట్టణ కేంద్రంలో ఈ నెల 13న నిర్వహించే ఎంఐఎం పట్టణ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని నూతనంగా ఎన్నికైన ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు మీర్ ఇలియాజ్ అలీ కోరారు. ఆదివారం పట్టణ కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పార్టీ నాయకులతో కలిసి మాట్లాడారు. పార్టీ అగ్రనేత ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ, మలకపేట ఎమ్మెల్యే బలాలా ఆదేశాల మేరకు ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో అహ్మద్‌బిన్ మోసిన్, హబీబ్‌ఖాన్, ఖదీర్, అహ్మద్, అబ్దుల్ అల్తాఫ్, సమీర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమ నేత రాములుకు ఘన నివాళి



బోధన్: పట్టణ కేంద్రంలోని పాన్‌గల్లీకి చెందిన రైతు కూలీ సంఘం జిల్లా నాయకుడు, ఉద్యమ నేత పడాల రాములు వర్ధంతిని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ డివిజన్, మండల నాయకులు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డివిజన్ సహాయ కార్యదర్శి బి మల్లేశ్ మాట్లాడుతూ.. రైతులు, వ్యవసాయ కూలీలు, పేద ప్రజల సమస్యల పరిష్కారానికి జరిగిన అనేక ఉద్యమాల్లో క్రియాశీలపాత్ర పోషించారని అన్నారు. ఆయన మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటన్నారు. నిజాంషుగర్ ఫ్యాక్టరీ భూములను భూమి లేని పేదలకు పంపిణీ చేయాలని, నిజాం సాగర్ ప్రాజెక్టు నీళ్ల కోసం జరిగిన పోరాటాల్లో రాములు అగ్రభాగాన నిలిచాడని గుర్తు చేశారు. రాములు ఆశయాల సాధనకు ముందుకెళ్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి పడాల శంకర్, ప్రతినిధులు, సభ్యులు బొంతల సాయిలు, బాలయ్య, పార్వతి, పోశెట్టి, రాములు, సుమన్, హరి తదితరులు పాల్గొన్నారు.

సైకిల్ చక్రమే.. జీవన చక్రం

బాల్కొండ: రెక్కాడితే కాని డొక్కాడని పరిస్థితి అతినిది. నా అనుకున్న వారు ఎవరూ లేరు. ఏడు పదుల వయస్సు దాటినా ఒక్క పూట బుక్కెడు కోసం చాలా కష్టపడుతున్నాడు ముప్కాల్ మండలం వెంచిర్యాల్ గ్రామానికి చెందిన లింగన్న. గత పదేళ్ల క్రితం బంధువుల వద్ద ఉన్న లింగన్న ప్రస్తుతం గ్రామంలోని ఓ చిన్న గుడిసెలో నివసిస్తూ ఒంటరి జీవనం సాగిస్తున్నాడు. బుక్కెడు బువ్వ కోసం గతంలో పని చేసిన కత్తెర దారు పనిచేస్తూ జీవనం వెల్లదీస్తున్నాడు. వయస్సు పై ప్రభావంతో సైకిల్ తొక్కలేని స్థితిలో ఉన్నా దానిని లాక్కుంటు వెళ్తూ గ్రామాల్లో పర్యటిస్తూ సైకిల్ ఏర్పాటు చేసుకున్న కత్తెర దారుతో ఉపాధి పొందుతున్నాడు. వచ్చిన ఆదాయంతో జానెడు పొట్టను నింపుకుంటున్నాడు. కనీసం వృద్ధాప్య పింఛన్ కూడా రావడం లేదని అతను వాపోతున్నాడు. ప్రభుత్వం స్పందించి వృద్ధాప్యంలో కష్టపడుతున్న లింగన్నను ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



సైకిల్ పై కత్తెర దారు పడుతున్న లింగన్న

ఆధ్యాత్మికం

■ వైభవంగా లక్ష్మీనృసింహస్వామి కల్యాణం



కమ్మర్‌పల్లిలో స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్న పురోహితుడు

కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లి మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ఆదివారం శ్రీలక్ష్మీనృసింహస్వామి జయంతిని పురస్కరించుకొని స్వామి వారి కల్యాణాన్ని గ్రామ కమిటీ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు శివ, పురోహితులు స్వామి వారి కల్యాణాన్ని జరిపించగా, వీడీసీ సభ్యులు స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. గ్రామస్తులు తరలివచ్చి కల్యాణోత్సవాన్ని తిలకించారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో రామస్వామి, బుచ్చి మల్లయ్య, నిమ్మ ప్రసాద్, మోహన్, గణేశ్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

■ ఆలయంలో పూజలు

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలోని గోల్‌బంగ్లా వద్ద ఉన్న శ్రీ లక్ష్మీనృసింహ స్వామి ఆయంలో ఆదివారం స్వామివారి జయంతి వేడుకలను సర్వసమాజ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.



లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న సర్వసమాజ్ సభ్యులు

పురోహితుడు వెంకటేశ్ సమక్షంలో స్వామి వారికి అభిషేకం, కలశస్థాపన, నవగ్రహ పూజ, యజ్ఞం, డోలోత్సవ కార్యక్రమాలు చేపట్టారు. భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం రథోత్సవం ఉంటుందని ఆలయ అర్చకుడు తెలిపారు. కార్యక్రమంలో సుమన్, కర్తన్ దినేష్, సదరుల బాల్‌రెడ్డి, గోర్తదేవేందర్, పుప్పాల గిరి, నారాయణరెడ్డి, దొండి శ్యామ్, పుప్పాల రాజశేఖర్, రవి, భూమేశ్, ఆలూర్ మోహన్, కాసుల పోశెట్టి, పూల నర్సయ్య, చక్రి తదితరులు పాల్గొన్నారు.

■ బోధన్‌లో..

బోధన్‌రూరల్: బోధన్ పట్టణంలోని బీటీ నగర్‌లో ఉన్న శ్రీకోట మైసమ్మ ఆలయంలో ఆదివారం శ్రీకోట మైసమ్మ సహిత లక్ష్మీనృసింహ స్వామి కల్యాణాన్ని వైభవంగా ఘనంగా నిర్వహించారు. మల్లారం ఆశ్రమ పీఠాధిపతి పిట్ల కృష్ణ మహరాజ్ కార్యక్రమానికి స్వామి వారి కల్యాణ వేడుకలకు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ప్రముఖ పండితులు ప్రవీణ్ మహరాజ్, రోహిత్ శర్మ స్వామి వారి కల్యాణాన్ని ఘనంగా చేపట్టారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకుడు గోపికిషన్, కాలనీవాసులు, భక్తులు పాల్గొన్నారు.



కోట మైసమ్మ ఆలయంలో స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్న పిట్ల కృష్ణమహరాజ్, అర్చకులు

రామాలయ ఉత్సవాలకు మైనార్టీలకు ఆహ్వానం



నందిపేటలో ముస్లింలకు ఆహ్వాన పత్రికలను అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

నందిపేట్: మండల కేంద్రంలోని రామనగర్‌లో ఈ నెల 14 నుంచి 16 వరకు నిర్వహించే సీతారాముల విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలకు ఆదివారం రామాలయ కమిటీ సభ్యులు ముస్లిం మైనార్టీ కమిటీ సభ్యులకు ఆహ్వాన పత్రికలను అందజేశారు. మూడు రోజులుగా నిర్వహించే ఉత్సవాల్లో పాల్గొని మత సామరస్యతకు ప్రతీకగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రమణారెడ్డి, పెయింటర్ రాజు, కండక్టర్ నారాయణ, మంద సాయన్న, మచ్చర్ల సాగర్, మైనార్టీ కమిటీ అధ్యక్షుడు హైమద్‌ఖాన్, బారి, సయ్యద్ హుస్సేన్, జావిద్, ఉస్మాద్దీన్, ముస్లింలు పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్ర స్వామి ఉత్సవాలు ప్రారంభం



రెంజర్లలో పల్లకీ సేవ నిర్వహిస్తున్న భక్తులు

బాల్కొండ: ముప్కాల్ మండలం రెంజర్లలో వీరబ్రహ్మేంద్ర స్వామి ఉత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో స్వామి వారి ప్రతిమ, చిత్రపటానికి ఉంచి పల్లకీ సేవ చేపట్టారు. సోమవారం స్వామివారి కల్యాణ వేడుకలను నిర్వహిస్తున్నట్లు సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో విశ్వబ్రహ్మణ సంఘం సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



దూపల్లిలో చెక్కు అందజేస్తున్న నాయకులు

రెంజల్: మండలంలోని దూపల్లిలో పలువురు లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను స్థానిక కాంగ్రెస్ నాయకులు ఆదివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బాబన్న, స్థానిక కాంగ్రెస్ నాయకులు సోనారి గంగాధర్, నంగి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు శివాలయంలో ప్రత్యేక పూజలు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నవనాథ సిద్ధుల గుట్టపై ఉన్న శివాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. స్వామి వారి ఉత్సవ విగ్రహాలను ఆలయ పరిసర ప్రాంతాల్లో పల్లకీ సేవ నిర్వహించనున్నట్లు సభ్యులు పేర్కొన్నారు.

పోగొట్టుకున్న ఫోన్ అప్పగింత



ఫోన్ అందజేస్తున్న ఏఎస్సై చిన్న గంగారాం

బాల్కొండ: పోగొట్టుకున్న ఫోన్‌ను బాధితుడికి స్థానిక పీఎస్‌లో ఏఎస్సై చిన్న గంగారాం ఆదివారం అందజేశారు. ముప్కాల్ మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి తన ఫోన్‌ను పోగొట్టుకోవడంతో పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు సెల్‌ఫోన్ సీఈఐఆర్ పద్ధతి ద్వారా మొబైల్ ఫోన్‌ను కనుగొని బాధితుడికి అందించారు. కార్యక్రమంలో పోలీసుల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సినిమా

పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)

స్క్రీన్-1	రైడ్-2(హిందీ)-10.00, 1.00, 7.25, 10.25, రెట్రో-4.00
స్క్రీన్-2	హిట్-12.30, 3.45, 7.00, 10.15
స్క్రీన్-3	రెట్రో-11.30, 2.55, 6.20, 9.45
స్క్రీన్-4	హిట్-11.30, 2.45, 6.00, 9.15

మాంసం ధరలు (రూ..)

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	190
		లైవ్	160
స్కిన్‌లెస్	220	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	97,200	వెండి(కిలో)	1,00,000
22 క్యారెట్స్	89,725		

– నిజామాబాద్ బిజినెస్